సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 10 । మే । 2024



దర్శించి.. తరించి

వేములవాడ: రాజన్నను గురువారం భారీగానే భక్తులు తరలివచ్చారు. మోదీ పర్యటన ముగియడం.. గుడిలో ఆంక్షలు ఎత్తివేయడంతో భక్తుల రద్దీ పెరిగింది.

న్యూస్‌రీల్

ధాన్యం రవాణాకు వాహనాలు సిద్ధం చేయాలి



అధికారులతో సమావేశమైన అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కేంద్రాల వద్ద కొనుగోలు చేసిన తర్వాత వెంటవెంటనే మిల్లులకు తరలించాలని, అందుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ధాన్యం కొనుగోళ్లు, రవాణా తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు కేంద్రాల ద్వారా 1,63,069 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో 1,61,539 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించామన్నారు. మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని కోతల పేరిట ఇబ్బందులు పెట్టొద్దన్నారు. సివిల్ సప్లయి డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీఎస్‌ఓ ప్రేంకుమార్, డీఆర్‌డీవో రవీందర్, డీసీవో శ్రీమాల తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీపీవో

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం డీపీవో ఆశలత పరిశీలించారు. విద్యుత్, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలోని తాగునీటి సరఫరా తీరును పరిశీలించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆమె వెంట డీఎల్‌పీవో శంకర్, ఎంపీవో శేషయ్యసూరి, పంచాయతీ కార్యదర్శి మారుతి ఉన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కిరణ్

పెద్దపల్లిరూరల్: భూసార పరీక్షలు చేయించి లోపాలున్న మేరకే ఎరువులు చల్లి భూసారాన్ని పెంపొందించుకుని పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించగలుగుతామని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త పిల్లి కిరణ్ అన్నారు. గురువారం పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలతో పోషకవిలువలే కాకుండా భూమిలోని చౌడు, సున్నం శాతాన్ని గుర్తించవచ్చన్నారు. రైతులు తమ భూముల్లోనుంచి మట్టి నమూనాలను సేకరించి రామగిరి కృషి విజ్ఞాన కేంద్రానికి పంపితే పరీక్షలు నిర్వహించి సూచనలు అందిస్తామని తెలిపారు. ఏఈవో శ్వేత పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



కవాతు ప్రారంభిస్తున్న ఏసీపీ గజ్జి కృష్ణ

సుల్తానాబాద్‌రూరల్: నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. గురువారం సుల్తానాబాద్‌లో నిర్వహించిన పోలీసు కవాతును ప్రారంభించి మాట్లాడారు. ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు పోలీసులు, పారా మిలటరీ దళాలు, బీఆర్‌ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైన మద్యం, డబ్బులు పంపినట్టు దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్బారెడ్డి, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు శ్రావణ్‌కుమార్, అశోక్‌రెడ్డి, శ్రీధర్, ఓంకార్‌యాదవ్ పాల్గొన్నారు.

అభ్యర్థులు ప్రచార వ్యయ వివరాలతో 11న రండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి పోటీపడుతున్న అభ్యర్థులు ఎన్నికల ప్రచార వ్యయ వివరాలతో ఈనెల 11న కలెక్టరేట్‌లోని కార్యాలయంలో హాజరు కావాలని ఎన్నికల ఖర్చుల నమోదు నోడల్ అధికారి శ్రీమాల అన్నారు. ప్రచార వ్యయ వివరాల రిజిస్టర్‌తో స్వయంగా గాని, ఏజెంటు ద్వారానైనా హాజరు కావచ్చని తెలిపారు.



తెలంగాణచౌక్‌లో హాజరైన జనం



అభివాదం చేస్తున్న కేసీఆర్

గులాబీ దళపతికి నీరాజనం

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్వాగతం
- రాంనగర్ నుంచి భారీ ర్యాలీ
- తెలంగాణ చౌక్‌లో రోడ్‌షో
- తరలివచ్చిన జనం.. కిక్కిరిసిన కరీం'నగరం'
- కార్నర్ మీటింగ్ సక్సెస్.. బీఆర్‌ఎస్‌లో జోష్

కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గురువారం కరీంనగర్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా జిల్లాకేంద్రంలో జరిగిన రోడ్‌షో, కార్నర్ మీటింగ్ సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. కేసీఆర్ మొదట ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఉజ్వలపార్కు మీదుగా రాంనగర్ చౌరస్తాకు భారీ కాన్వాయ్‌తో సరిగ్గా రాత్రి 7.50 నిమిషాలకు చేరుకున్నారు. రాంనగర్ చౌరస్తాలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, వొడితెల సతీశ్‌బాబు, మేయర్ వై.సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, చలిమెడ లక్ష్మీనరసింహరావు, సర్దార్ రవీందర్‌సింగ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, డిప్యూటీమేయర్ చల్లా స్వరూపరాణి–హరిశంకర్‌లు కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి తెలంగాణచౌక్ వరకు 40నిమిషాల పాటు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో దారిపొడవునా బాణసంచా పేలుస్తూ, ఒగ్గుడోలు కళాకారులు, డప్పు చప్పుళ్లతో, మహిళలు మంగళహారతులతో నీరాజనం పలికారు. 40 నిమిషాలపాటు సాగిన ర్యాలీలో కేసీఆర్ ప్రజలకు బస్సులో నుంచే అభివాదం చేస్తూ ముందుకు సాగుతూ కార్యకర్తల్లో జోష్‌పెంచారు. 8.30 గంటలకు తెలంగాణచౌక్‌కు చేరుకున్న కేసీఆర్ బస్సుపై నుంచి అభివాదం చేస్తూ 10 నిమిషాల పాటు అభివాదం చేస్తూ ఉత్తేజం నింపారు. 25నిమిషాల పాటు చేసిన ప్రసంగంతో తెలంగాణచౌక్‌కు తరలివచ్చిన జనం సీఎం కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు చేసినప్పుడల్లా కేరింతలు, అరుపులతో సభా ప్రాంగణమంతా దద్దరిల్లింది. ప్రసంగం ప్రారంభంలో కరీంనగర్ భీముడు, అభివృద్ధి ప్రదాత గంగుల కమలాకర్ అనడంతో జనం హర్షధ్వనాలు పలికారు. పాడికౌశిక్‌రెడ్డిని హుజూరాబాద్ టైగర్ అంటూ కేసీఆర్ పొగడ్తలతో ముంచెత్తారు. స్మార్ట్‌సిటీ తెచ్చిన వినోద్‌కావాలా... నయాపైసా తేని బండి సంజయ్ కావాలో ఆలోచించాలని అనడంతో.. సభ నుంచి భారీ స్పందన వ్యక్తమైంది. రోడ్‌షోకు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల ముఖ్యనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కళాకారుల ఆటపాట



తెలంగాణచౌక్‌లో భవనాలపై నుంచి కేసీఆర్ ప్రసంగం వింటున్న ప్రజలు

పార్లమెంటులో పెద్దపల్లి గొంతుకనవుతా



- ఆగర్భ శ్రీమంతుడికి.. భూగర్భ కార్మికుడికి మధ్యే పోటీ
- ఒకే ఫ్యామిలీకి మూడు అవకాశాలు కల్పించడమే సామాజిక న్యాయమా?
- హామీలు నెరవేర్చకుండా ఓట్లు అడిగే నైతికహక్కు కాంగ్రెస్‌కు లేదు
- కాంగ్రెస్, బీజేపీలే సింగరేణిని ముంచినాయి
- 'సాక్షి'తో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లిలో ఎగిరేది గులాబీ జెండానేనని, ఇది కేసీఆర్ చెప్పినట్లుగా ఆగర్భ శ్రీముంతుడికి, భూగర్భ కార్మికుడికి మధ్య పోటీయేనని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రజా సమస్యల కోసం కేంద్రం మెడలు వంచగలిగే శక్తి కేవలం బీఆర్‌ఎస్‌కే ఉందన్న విషయాన్ని ప్రజలు గుర్తించారని, అందుకే ఈసారి పెద్దపల్లి నుంచి తన గెలుపు ఖాయమని, ప్రజల గొంతును పార్లమెంటులో వినిపిస్తానని తెలిపారు. సామాజిక న్యాయాన్ని తొంగులో తొక్కినా కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధిచెప్పాలని అన్నారు. బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. – సాక్షి, పెద్దపల్లి

మీ ప్రచారం ఎలా సాగుతుంది? ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుంది?

అమలు కాని హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అనతి కాలంలోనే పరిపాలనలో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసింది. ఏ ఒక్క హామీ సక్కగా అమలు చేయడం లేదు. ప్రజలు తొందరపాటుతో ఓటేశామని తమ బాధలు చెప్పుకుంటున్నారు. మళ్లీ సారే రావాలి కావాలి అంటూ తమ బిడ్డగా స్వాగతిస్తున్నారు. హామీలు అమలు కావాలంటే బీఆర్‌ఎస్ గెలవాలి. ఎంపీగా గెలిస్తే ప్రజా గొంతుకవుతా. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పథకాలను అమలు చేయిస్తా.

మీపై వస్తున్న విమర్శలపై స్పందన ఏంటి?

మచ్చలేని నాయకుడిని, నన్ను విమర్శించడానికి, వారికి చెప్పుకోవడానికి చేసిన అభివృద్ధి పనులు ఏం లేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ప్రజల బాగు కోసం అభివృద్ధికి పాటు పడే వారు కావాలా? తాగు, సాగు నీరు అందించక రైతుల ఆత్మహత్యలు చేసుకునేలా చేసిన పార్టీ కావాలా? ఒక్క కుటుంబంలోనే ముగ్గురికి పదువులు కావాలో విజ్ఞులైన ప్రజలే ఆలోచించాలి. 40 ఏళ్లుగా వారి కుటుంబమే ఈ పెద్దపల్లిని పరిపాలించాలా? తాత, తండ్రి, మనువడు అంటూ ప్రజల మీద రుద్దుతున్నారు. దేశంలో శ్రీమంతుల జాబితాలో 9వ నంబర్‌గా ఉన్న వారు రిజర్వ్‌డ్ స్థానంలో పోటీచేయడం ఎందుకు? ఇదెక్కడి సామాజికన్యాయమో ఆలోచించాలి.

ఎన్నికల్లో ఎంపీగా గెలిస్తే నియోజకవర్గానికి ఏం చేస్తారు?

సింగరేణి కార్మికుడిగా నాకు కార్మికుల సమస్యలు తెలుసు. సింగరేణి విస్తరించిన ప్రాంతాల్లో కొత్తగనుల ఏర్పాటు, ఆదాయపన్ను మినహాయింపు, పెన్షన్ విధానం, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లిలో పలు సూపర్ ఫాస్ట్ రైళ్ల నిలుపుదల, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కృషిచేస్తా. సుల్తానాబాద్‌లో డ్రైపోర్టు నిర్మాణం, ఓదెల, రామగిరిఖిల్లా, ధర్మపురి, కాళేశ్వరం, రామునిగుండాలతో పాటు పలు ప్రాంతాలను టూరిజం హబ్‌గా మార్చేలా నా దగ్గర ప్రణాళికలున్నాయి.

బీఆర్‌ఎస్ ఎంపీలను ఎందుకు గెలిపించాలి?

మా నాయకుడు కేసీఆర్ చెప్పినట్లుగా కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే. బలమైన బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే తెలంగాణ హక్కుల కోసం బరిగీసి కొట్లాడుతాం. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో సైతం రాజకీయ సంక్షోభం వచ్చే అవకాశం ఉంది. అందుకే బీజేపీతో రేవంత్‌రెడ్డి అంటకాగుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ఒక్కరికి ఒక్కరు సహకరించుకుంటున్నారు.

మీ ప్రత్యర్థి పార్టీలపై మీ స్పందన ఏంటి?

పదేళ్లలో కేంద్రంలో బీజేపీ చేసిందేమీ లేదు. కనీసం చెప్పుకోవడానికి ఫలానా పని అంటూ కనిపించడం లేదు. 2019లో పుల్వామా దాడిని ఉపయోగించుకున్నారు. ఇప్పుడు రామమందిరం పేరుతో రాజకీయం చేస్తున్నారు. మాకు అన్ని మతాలు సమానమే. రెచ్చగొట్టే రాజకీయాలు మేం చేయం. తెలంగాణపై బీజేపీ సవతి తల్లి ప్రేమ చూపెట్టింది. సింగరేణిని ప్రైవేట్‌పరం చేయవద్దని చెప్పిన, నోటిఫికేషన్ ఇచ్చి ప్రైవేట్‌పరం చేశారు.

చివరగా నియోజకవర్గ ఓటర్లకు మీరు ఏం చెప్పదల్చుకున్నారు?

ఇక్కడే పుట్టా.. ఇక్కడే పెరిగా.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా.. ఇక్కడే చస్తా.. ఈ గోదావరి తల్లిగా ప్రమాణం చేసి చెప్పుతున్నా. ఒక్కసారి ఎంపిగా గెలిపిస్తే సింగరేణి కార్మికుల సమస్యలు, నియోజవకవర్గ పరిధిలోని రైల్వే సమస్యల పరిష్కారం కోసం, ఇక్కడి ప్రజల వాణిని ఢీల్లీలోని పార్లమెంట్‌లో వినిపిస్తా. అదే స్థానికంగా ఉండని, ఏసీల్లో తిరిగే వ్యాపారవేత్తలైన వారికి ఓటు వేస్తే మురుగుకాలువలో వేసినట్లే అవుతుంది. ప్రజలు ఆలోచించి నన్ను ఆశీకర్వదించాలని కోరుకుంటున్నా.

చెప్పింది 20 కోట్ల ఉద్యోగాలు.. ఇచ్చింది 7లక్షలు

- యువతను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం
- రాజ్యాంగ మార్పుకోసం 400సీట్ల ఆరాటం
- ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తాం
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

గోదావరిఖని: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏటా 2 కోట్ల ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేసిందని, గడిచిన పదేళ్లలో 20కోట్ల ఉద్యోగాలివ్వాల్సి ఉండగా కేవలం 7లక్షల మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. గురువారం శారదానగర్‌లోని రెడ్డిఫంక్షన్‌హాల్‌లో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్‌తో కలిసి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి వస్తే యువతకు అన్యాయం జరగకుండా చూస్తామని, యువ న్యాయం పేరుతో ఉద్యోగం వచ్చేంత వరకు ఏటా రూ.లక్ష చెల్లించేలా నిర్ణయించినట్లు తెలిపారు. పదేళ్ల బీజేపీ పాలనలో అన్నిరంగాల్లో దేశం వెనకబడిందన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. యువత గురించి దేశప్రధాని నరేంద్రమోదీకి మాట్లాడే హక్కు లేదన్నారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ విధించి సామాన్యులకు అందని స్థాయికి ధరలు పెంచారన్నారు. కేంద్రంలో 400సీట్లు సాధించి డాక్టర్‌బాబాసాహెచ్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రారంభంలోనే ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగ ప్రతులను కాలబెట్టిందని, మూడేళ్ల పాటు కార్యాలయం వద్ద కూడా జెండా ఎగురనీయ లేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్లు ఎత్తివేస్తే తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ క్రమంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రామగుండాన్ని ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. రామగుండం నుంచి మణుగూరు వరకు సింగరేణి, ఎన్టీపీసీ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాశ్, బాలరాజ్‌కుమార్, పాతిపెల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీరు అందించడమే ధ్యేయం

ధర్మారం: ధర్మపురి, పెద్దపల్లి నియోజకవర్గాల రైతులకు సాగు, తాగునీరందించడమే ధ్యేయమని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మారం మండల కేంద్రంలో గురువారం రాత్రి నిర్వహించిన రోడ్డుషోలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణలతో కలిసి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పత్తిపాకలో రిజర్వాయర్ నిర్మాణం చేపడ్తామని ఈ ప్రాంత రైతులను మోసం చేసిందన్నారు. రెండు నియోజకవర్గాల రైతులకు ఉపయోగకరంగా ఉండే పతిపాక రిజర్వాయర్‌ను నిర్మించి తీరుతామన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎంపీగా గడ్డం వంశీని గెలిపించాలని కోరారు.

కార్మికులకు త్వరలో ఇళ్ల స్థలాల పట్టాలు

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు త్వరలోనే ఇళ్ల స్థలాల పట్టాలు అందజేస్తామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్ అన్నారు. గురువారం ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి, ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికులకు 200గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పదేళ్లు కలిసి కాపురం చేసిన బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకున్నాయని తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్‌ను కాకా వెంకటస్వామి ఏర్పాటు చేస్తే, మాజీ ఎమ్మెల్యే అందులోని కొలువులు అమ్ముకున్నారన్నారు. ఏరియా వర్క్‌షాప్‌లో నెలకొన్న సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన కార్మికులను ఏనాడు పట్టించుకోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు కొప్పుల ఈశ్వర్‌కు ఓటు వేయాలని అడుగుతున్నారన్నారు. కార్మిక క్షేత్రాన్ని సింగరేణి కారిడార్‌గా మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టిందన్నారు. రాబోయే రోజుల్లో పారిశ్రామిక క్షేత్రం ఇండస్ట్రియల్ హబ్‌గా మారబోతుందన్నారు. అవినీతి రహిత సమాజ స్థాపన ధ్యేయంగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారెల్లి రాజిరెడ్డి, బదావత్ శంకర్‌నాయక్, బాల రాజ్‌కుమార్, కొత్త సత్యనారాయణరెడ్డి, ఆకుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే ఆత్మగౌరవం చంపుకోవడమే

యైటింక్లయిన్‌కాలనీ: బీఆర్‌ఎస్ పార్టీకి ఓటేస్తే ఆత్మగౌరవం చంపుకోవడమే అవుతుందని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం రాత్రి యైటింక్లయిన్‌కాలనీలోని 15, 16, 17, 18, 19 డివిజన్ల ఏరియాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీతో కుమ్మక్కై రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణం చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు రాజేశ్, కార్పొరేటర్లు శంకర్‌నాయక్, సాగంటి శంకర్, ఆయా డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



వైద్యసేవలపై ఆరా తీస్తున్న కమిషనర్

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రి, మాతాశిశు ఆసుపత్రులకు వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణ, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే వారిని ప్రజలు ఆదరించి గౌరవిస్తారని, ప్రతిఒక్కరూ రోగులతో మర్యాదపూర్వకంగా మెలగాలని అన్నారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను డీసీహెచ్‌ఎస్ రమాకాంత్ వివరించారు. కమిషనర్ వెంట శౌరయ్య, శ్రీధర్ తదితర సిబ్బంది ఉన్నారు.

జప్తు.. ఆధారాలు చూపితే విడుదల

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చేపట్టిన వాహన తనిఖీల్లో ఇప్పటివరకు రూ.1,92,56,462 నగదు జప్తు చేశామని కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఇందులో సరైన ఆధారాలు చూపిన వారికి రూ.1,90,86,332 నగదు విడుదల చేశామన్నారు. ఆధారాలు చూపని రూ.1,70,130లను సీజ్ చేసి ఉంచినట్లు తెలిపారు. వివరాలు చూపితే జప్తు చేసిన నగదును అప్పగిస్తామని అన్నారు.

వేసవి క్రీడాశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వేసవి క్రీడాశిబిరంలో విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడాశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడా శాఖ అధికారి సురేశ్ అన్నారు. గురువారం శిక్షణా శిబిరాలను సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో హ్యాండ్‌బాల్ కోచ్ సురేందర్ శిక్షణఇస్తున్నాడని అన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

మంథని: రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం మంథని మండలంలోని రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. రేషన్‌షాప్ నం.21డిలో 82.47 క్వింటాళ్ల బియ్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. సదరు డీలర్ బియ్యాన్ని నల్లబాజరుకు పంపే ఉద్దేశ్యంతో పక్కనే ఉన్న గదిలో దారి పెట్టినట్లుగా తనిఖీలో బయటపడిందని తెలిపారు. రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద వివరాలిలా..

ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటరుకు సమగ్ర వివరాలను అందుబాటులో ఉంచేలా ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద అసెంబ్లీ నియోజకవర్గ కేంద్ర సంఖ్య, పోలింగ్‌బూత్ నంబర్‌తో బీఎల్‌వో పేరు, సెల్ నంబర్, సంబంధిత అధికారుల పేర్లు సెల్ నంబర్ల వివరాలను పోలింగ్‌బూత్ వద్ద గోడపై రాయించారు. – పెద్దపల్లిరూరల్

క్లుప్తంగా

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



డివైడర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

రామగుండం: మల్యాలపల్లి సబ్ స్టేషన్ వద్ద గల రాజీవ్ రహదారిపై గురువారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. కరీంనగర్–2డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వస్తుండగా మల్యాలపల్లి సబ్‌స్టేషన్ మూలమలుపు వద్ద ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. రోడ్డుకు మరోవైపు ప్రమాదం జరిగి ఉంటే బస్సు బోల్తాపడి భారీ ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉండేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ట్రాక్టర్ బోల్తా: వ్యక్తి మృతి


పుట్ట ప్రశాంత్ మృతదేహం

జూలపల్లి: జూలపల్లి మండలం కాచాపూర్‌లో గురువారం ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో పుట్ట ప్రశాంత్(32) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై ఎస్. శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్ నడుపుతూ జీవిస్తున్న ప్రశాంత్ గురువారం ఉదయం ట్రాక్టర్‌లో ధాన్యం రవాణా చేస్తూ ఊర చెరువు సమీపంలో గల కల్వర్టు వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తాపడింది. ట్రాక్టర్ నడుపుతున్న ప్రశాంత్ ఇంజిన్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడు..



లింగయ్య(ఫైల్)

ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్‌కు చెందిన వృద్ధుడు సార్ల లింగయ్య(62) గురువారం వడదెబ్బతో మృతిచెందాడు. లింగయ్య ఉపాధిహామీ పనులకు వెళ్లి ఇంటికొచ్చాక అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం ముత్తారం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చిన కాసేపటికే ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

డీఎల్‌పీవోగా నరేశ్‌కుమార్

సిరిసిల్ల: జిల్లా డివిజనల్ పంచాయతీ ఆఫీసర్(డీఎల్‌పీవో)గా బి.నరేశ్‌కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు జారీ చేశారని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య గురువారం తెలిపారు. జిల్లా డీఎల్‌పీవోగా పనిచేసిన మల్లికార్జున్ రిటైర్డు కాగా.. ఆయన స్థానంలో వీర్నపల్లి పంచాయతీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బి.నరేశ్‌కుమార్‌ను నియమించారు.





రాయితీ.. పక్కదారి


నగరంలోని కమాన్ సమీపంలో ఉన్న ప్రముఖ టిఫిన్ సెంటర్ ఇదీ. నిత్యం రద్దీగా ఉండే సదరు ప్రాంతంలో యథేచ్ఛగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తూ.. టిఫిన్లు తయారు చేస్తున్నారు. కమర్షియల్ సిలిండర్ వినియోగించాల్సి ఉండగా మాకెవరు అడ్డన్నట్లు రాయితీ సిలిండర్లు వాడుతున్నారు.


నగరంలోని మంకమ్మతోటలోని రెస్టారెంట్ ఇది. సబ్సిడీగ్యాస్‌ను ఇష్టారీతిగా వాడుతుండగా అసలు వీళ్లకు రవాణా చేసేవారు కూడా అంతే బరితెగించారు. ఇక్కడ నిత్యం సబ్సిడీ గ్యాస్‌నే వినియోగిస్తారని ఆహారప్రియులు చెబుతున్నారు.


నగరంలోని అంబేద్కర్ స్టేడియం సమీపంలో ఇటీవల ప్రారంభమైన టిఫిన్ సెంటర్ ఇది. ఇలా ఇష్టారీతిగా సబ్సిడీ గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధమైనా.. అధికారులతో తమకు సాన్నిహిత్యమని చెబుతుండటం విశేషం.

- హోటళ్లలో యథేచ్ఛగా సబ్సిడీ సిలిండర్ల వినియోగం
- ఎన్నికల వేళ మరింత పెరిగిన దందా
- అధికారుల తనిఖీల్లేవ్.. అమ్యామ్యాలే
- ప్రతీ నెలా బ్లాక్ మార్కెట్‌కు వేల సిలిండర్లు
- నగరంలో పలు ఏజెన్సీల మాయాజాలం


కరీంనగర్‌లోని టవర్‌సర్కిల్ వద్ద ఉన్న ఓ జిలేబీ సెంటర్‌లో యథేచ్ఛగా వాడుతున్న రాయితీ సిలిండర్

కరీంనగర్ అర్బన్: నగరంలోని అత్యధిక హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, చిరుతిళ్ల తయారు చేసే కేంద్రాల్లో దర్జాగా రాయితీ గ్యాస్ వినియోగిస్తున్నారు. పలు ఏజెన్సీలు నిబంధనలను విస్మరించి భారీ అక్రమాలకు తెర తీయగా.. పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దందాను మరింత పెంచారు. హోటళ్లు, చిరుతిళ్ల తయారీ, రెస్టారెంట్లు, దాబాల్లో రాయితీ వంటగ్యాస్ సిలిండర్లు దర్శనమిస్తున్నాయి. అదేంటీ.. ఆన్‌లైన్‌లో బుకింగ్ కదా అంటే.. పలు గ్యాస్ ఏజెన్సీల నిర్వాకం వల్ల ఇదిగో ఇలా హోటళ్లలో చేరుతాయంతే.!!

అటకెక్కిన తనిఖీలు

ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తుండటంతో క్షేత్రస్థాయి పర్యవేక్షించాల్సిన పౌరసరఫరాల శాఖ పట్టనట్లు వ్యవహరిస్తోంది. నగరంలో ఇండెన్, హెచ్‌పీ, భారత్ కంపెనీల వినియోగదారులుండగా 11 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఏజెన్సీలు, గోడౌన్లలో తనిఖీలు చేపట్టాల్సిన పౌరసరఫరాలశాఖ అధికారులు ఏనాడో సదరు విధులను మరిచారన్న విమర్శలున్నాయి. సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్, డీటీ సివిల్ సప్లయ్, ఏఎస్వోలు ప్రతినెలా తనిఖీలు నిర్వహించాలన్న టార్గెట్‌నే మరిచారు.

నెలకు రూ.కోట్లలో అక్రమ దందా

నగరంలోని పలు హోటళ్లలో ఆహారనాణ్యత అటుంచితే హెచ్చు ప్రాంతాల్లో కమర్షియల్ సిలిండర్లు పేరుకు మాత్రమే కనిపిస్తాయి. కమర్షియల్ సిలిండర్ ధర రూ.2,300 ఉండగా సబ్సిడీ గ్యాస్ రూ.1,000కే దొరుకుతుండటం, అందుకు గ్యాస్ ఏజెన్సీలు, డెలివరీబాయ్‌ల సంపూర్ణ సహకారముండటంతో కమర్షియల్ సిలిండర్ వాడకాన్ని 70శాతం తగ్గించారు. ఒక్కో హోటల్‌లో కస్టమర్లను బట్టి కనిష్టంగా నెలకు 10 నుంచి 50సిలిండర్లు వినియోగిస్తున్నారు. ఈ లెక్కన రాయితీ గ్యాస్ వినియోగించే ఒక్కో హోటల్‌లోనే రూ.20వేల నుంచి రూ.70వేల వరకు అక్రమంగా లాభపడుతున్నారు. రాయితీ గ్యాస్ వినియోగించే అన్ని ప్రాంతాలను లెక్కిస్తే నెలకు రూ.కోట్లలో ప్రయోజనం పొందుతున్నారు. మరీ ఇందులో ఎవరి వాటాలు ఎంతో తేలాల్సి ఉంది.

భారీగా తేడాలు

నగరంలో రెస్టారెంట్లు, హోటళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, టీస్టాల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, తోపుడు బండ్లు అన్ని కలిపి 2వేల వరకు ఉంటాయని అంచనా. కానీ వారు బుక్‌చేసే సిలిండర్ల సంఖ్య మాత్రం తక్కువగా ఉంటోంది. విపరీతంగా కస్టమర్లు ఉన్న హోటళ్లలోనూ తక్కువ కమర్షియల్ సిలిండర్లు వాడారంటే అక్రమం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. విద్యార్థుల వద్ద రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేసే పలు విద్యాసంస్థల్లో సైతం రాయితీ సిలిండర్లు వినియోగిస్తున్నారు. పెద్దపెద్ద హోటళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను పరిగణనలోకి తీసుకుంటే నెలకు సుమారు 10వేల సిలిండర్ల వినియోగం జరగాలి. కాగా.. 11 ఏజెన్సీల పరిధిలో కేవలం వందల్లోనే కమర్షియల్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. మొత్తంగా సగటున నెలకు 20వేల సిలిండర్లు పక్కదారి పడుతున్నాయని సమాచారం.

తనిఖీలు చేపడతాం

డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కేవలం గృహాల్లో మాత్రమే వినియోగించాలి. కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వ్యాపారులు వినియోగించాలి. రాయితీ గ్యాస్ పక్కదారి పడుతుందన్నది తెలియదు. తనిఖీలు చేసి చర్యలు చేపడతాం.

– జిల్లా పౌరసరఫరాల అధికారి

మాకు దక్కిన గౌరవం


ప్రధాని మోదీకి ప్రసాదం అందిస్తున్న ప్రధాన అర్చకుడు భీమాశంకరశర్మ, అర్చకుడు శరత్‌శర్మ


కోడెమొక్కు వద్ద అర్చకుడు చందు, సిబ్బంది గొట్టం శ్రీనివాస్

- ప్రధానికి సేవ చేసిన అర్చకుల మనోగతం
- ప్రధాని వెంట నలుగురు అర్చకులు... ఒకరు సిబ్బంది
- ముందస్తు మూడు రోజులు శిక్షణ
- 8 నిమిషాల్లో పూజలు పూర్తి

వేములవాడ: రాజరాజేశ్వరస్వామికి ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా పూజలు చేయించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ప్రధానిని దగ్గరి నుంచే చూడడంతోపాటు తమ చేతులమీదుగా పూజలు చేయించడంతో ఈ జీవితానికి దక్కిన అరుదైన అవకాశమని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా భద్రత సిబ్బంది ఆధీనంలో ఉన్న రాజన్న ఆలయం గురువారం తెరుకుంది. ఈ సందర్భంగా ప్రధాని సేవలో తరించిన అర్చకులు, సిబ్బందిని 'సాక్షి' పలకరించగా.. వారు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మూడు రోజులు ట్రయల్స్.. 8 నిమిషాల్లో పూజలు పూర్తి

ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా ఎస్పీజీ బృందం ఆధ్వర్యంలో మూడు రోజులుగా శిక్షణ, ట్రయల్స్ నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. తమ ఆధార్‌కార్డు పరిశీలించడంతోపాటు మెడికల్ చెకప్ కూడా చేసినట్లు వివరించారు. పూజలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందే అవగాహన కల్పించారన్నారు. మోదీ పూజలు చేసే సమయంలో ఆలయంలో ప్రధాన అర్చకుడు అప్పాల భీమాశంకరశర్మ, అర్చకులు చంద్రగిరి శరత్‌శర్మ, మామిడిపల్లి శరత్‌శర్మ, చందు, సిబ్బంది గొట్టం శ్రీనివాస్ మాత్రమే విధుల్లో ఉన్నారు. మోదీ ఆలయంలోకి ప్రవేశించిన 8 నిమిషాల్లోనే శ్రీలక్ష్మీగణపతి పూజ, నందీశ్వరుడి పూజ, శ్రీస్వామి వారి దర్శనం, అమ్మవారి దర్శనం, ఆశీర్వచనం పూర్తి చేసినట్లు అర్చకులు వివరించారు.

బొట్టు..ప్రసాదం చెక్

రాజన్నను దర్శించుకున్న ప్రధాని మోదీకి పెట్టే బొట్టు మొదలుకొని ఇచ్చే ప్రసాదం వరకు క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే అందజేసినట్లు అర్చకులు వివరించారు.

రిటైర్‌మెంట్‌కు ముందు దక్కిన సదవకాశం


వచ్చే జనవరిలో నా రిటైర్‌మెంట్ ఉంది. రాజన్న దీవెనలతో దేశ ప్రధానికి సేవలందించే భాగ్యం లభించింది. ఇది నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నా. ఈ అనుభూతి జీవితంలో మరిచిపోలేను. – అప్పాల భీమాశంకరశర్మ, ఆలయ స్థానాచార్యులు

పూర్వజన్మ సుకృతం


పధానితో పూజలు చేయించడం పూర్వజన్మ సుకృతం. ఐదుగురు అర్చకులకు మాత్రమే అవకాశం కల్పించడం, అందులో మేముండడం గర్వంగా ఉంది. ఇంతటి అనుభూతిని జీవితంలో మరచిపోలేము. ప్రధానికి పూజలు చేయడంతో మమ్మల్ని మోదీ అర్చకులు.. అని పిలుస్తున్నారు. – చంద్రగిరి శరత్‌శర్మ, మామిడిపల్లి శరత్‌శర్మ

సంతోషంగా ఉంది


ప్రధాని కోడెమొక్కు చెల్లించుకునేటప్పుడు అర్చకుడు చందుతో కలిసి నేను పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ప్రధానిని దగ్గరి నుంచి చూసే భాగ్యం కలిగింది. భద్రత సిబ్బంది మూడు రోజుల నుంచే శిక్షణ ఇచ్చారు. వారు చెప్పిన విధంగానే మెదులుకున్నాను. – గొట్టం శ్రీనివాస్, కోడె మొక్కు సిబ్బంది

సింగరేణిని అమ్మేందుకు కాంగ్రెస్ కుట్ర


మాట్లాడుతున్న రాజిరెడ్డి

గోదావరిఖని: సింగరేణి సంస్థను ప్రయివేట్ వ్యక్తులకు అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బొగ్గు బ్లాకులను వేలం ప్రక్రియలోనే దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ, గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ చెప్పడం అన్యాయమన్నారు. వేలంలో బొగ్గు బ్లాకులు సింగరేణికి దక్కకుండా ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు దక్కితే జరుగబోయేది విధ్వంసమే అన్నారు. సంస్థకు అవసరం లేని విదేశీ యంత్రాలను కొనిపించిన ఆనాటి కాంగ్రెస్ పార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన అవినీతి వల్ల సింగరేణి సంస్థ నష్టాల పాలైందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, పర్లపల్లి రవి, పల్లె సురేందర్, బొగ్గుల సాయి, పులిపాక శంకర్, రాజ్‌కుమార్, పాశం శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

రాజన్న సేవలో ఐజీ



ఐజీ రాజేశ్‌కుమార్ సక్సేనాకు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

వేములవాడ: రాజన్నను ఐజీ రాజేశ్‌కుమార్ సక్సేనా గురువారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

విషాదం నింపిన క్యాన్సర్

- గర్భిణి మృతి
- కంటతడి పెట్టిన స్థానికులు, బంధువులు


దివ్య మృతదేహం

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ (జీజీహెచ్) ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణి గొంతు క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందిన ఘటన విషాదం నింపింది. మృతురాలి కుటుంబసభ్యులు, ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాల మేరకు.. మంథని ప్రాంతానికి చెందిన దివ్య (29)కు మూడేళ్ల క్రితం మొదటి కాన్పులో కూతురు జన్మించింది. రెండోసారి గర్భం దాల్చిన దివ్య ప్రస్తుతం 36 వారాల గర్భవతి. కాగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న దివ్య గురువారం ఇంట్లో శ్వాస తీసుకోవడం కష్టంగా ఉందంటూ అస్వస్థతకు గురైంది. హుటాహుటిన మంథనిలోని ప్రభుత్వ ఎంసీహెచ్ ఆస్పత్రికి తరలించగా గోదావరిఖని జీజీహెచ్‌కు రెఫర్ చేశారు. గోదావరిఖని ఆస్పత్రికి తరలించే లోగానే గర్భిణి అపస్మారక స్థితిలోకి చేరింది. వైద్యులు చికిత్స ప్రారంభించేలోగా మృతి చెందింది. మరోవైపు కడుపులోని శిశువును బతికించడానికి ఆపరేషన్ చేసినప్పటికీ శిశువు కూడా కడుపులోనే మృతి చెందింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించగా వివిధ సమస్యలతో ఆస్పత్రికి వచ్చిన పేషెంట్లు సైతం కంటతడి పెట్టారు.

శంకర జయంతి ఉత్సవాలు ప్రారంభం


పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ: రాజన్న సన్నిధిలో శంకర జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా నిత్యం ఉదయం స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, పారాయణాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజు సాయంత్రం కల్యాణ మండపంలో భగవత్ శంకరాచార్యుల పారాయణాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తామని వివరించారు. శ్రీపార్వతీ అమ్మవారికి చతుషష్టి పూజ నిర్వహిస్తామన్నారు.

బోధనాస్పత్రిలో వైద్యుల నిరసన


నిరసన తెలుపుతున్న వైద్యులు

సిరిసిల్లటౌన్: వైద్యులపై దాడులు నిలువరించాలని కోరుతూ సిరిసిల్ల జిల్లా జనరల్ ఆస్పత్రిలో గురువారం టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీటీజీడీఏ) నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ కోరుట్లలో విధి నిర్వహణలో ఉన్న వైద్యుడు శ్రావణ్‌కుమార్, సిబ్బందిపై ఓ రోగి బంధువులు జరిపిన అకారణ దాడిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీటీజీడీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ, వైద్యులు అరుణ్‌కుమార్, సుప్రియ, సంతోష్, సాయిరాజ్, శృతి, సాయికుమార్, సుగుణ, ఎం.లక్ష్మీనారాయణ, జయశ్రీ, వరుణ్, సాయికృష్ణప్రియ పాల్గొన్నారు.

రూ.14.05లక్షలు పట్టివేత

జగిత్యాలక్రైం/సారంగాపూర్: జగిత్యాలలోని తహసీల్ చౌరస్తా వద్ద పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన మందుల లచ్చన్న నుంచి రూ.6లక్షలు పట్టుకున్నారు. కొత్త స్టాండ్ చౌరస్తా వద్ద కథలాపూర్ మండలం గంభీరావుపేటకు చెందిన ఒగ్గు ప్రకాశ్ నుంచి రూ.7.50 లక్షలు సీజ్ చేశారు. కొత్తబస్టాండ్ వద్ద మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ రూ.45 వేల విలువైన కూలర్లు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. అలాగే సారంగాపూర్‌లో మహారాష్ట్రకు చెందిన వామన్‌లాల్ సింగ్ చౌహన్ అనే మామిడి వ్యాపారి నుంచి రూ.55వేలు పట్టుకున్నారు. పోతారం గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న రమేశ్ నుంచి రూ.5 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయంలో ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు


వేములవాడ: రాజన్న ఆలయంలో ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లను గురువారం చేపట్టారు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే తక్షణమే సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


హరీశ్(ఫైల్)

పాలకుర్తి: బసంత్‌నగర్‌కు చెందిన కొమ్ము హరీశ్(25) అనే యువకుడు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్‌లో నివాసముండే హరీశ్ సమీప బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యంలో పాల్గొన్నాడు. సాయంత్రం సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో ఇంటి గోడలు తడిచి విద్యుత్ సరఫరా జరిగింది. ఆ సమయంలో ఇంట్లో బట్టలు ఆరవేసే దండం తీగెకు హరీశ్ చేయి తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఇది గమనించిన హరీశ్ సోదరుడు వంశీ కర్ర సాయంతో తీగె నుంచి హరీశ్‌ను వేరుచేసి స్థానికుల సహాయంతో పెద్దపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి గతంలోనే మృతి చెందాడు. అవివాహితుడైన హరీశ్ స్థానిక ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి సారథ్యంలో నిర్వహిస్తున్న ఆలయ ఫౌండేషన్ సభ్యుడిగా కొనసాగుతూ పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటుండేవాడు. అందరితో కలివిడిగా ఉండే హరీశ్ మరణంతో బసంత్‌నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి తల్లి రమ, సోదరుడు వంశీలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

కోరుట్ల: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన బొగడమీది గౌరీ (32) అనే మహిళ బుధవారం రాత్రి యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. గౌరీ ఆమె భర్త అశోక్ మధ్య మనస్పర్థల కారణంగా జీవితంపై విరక్తితో బుధవారం మధ్యాహ్నం బాత్‌రూం యాసిడ్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి అన్న మెదిగోని నగేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి హామీ కూలీ మృతి


వెంకటమ్మ(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్: పూడిక తీత పనులకు వెళ్లిన ఉపాధి హామీ కూలీ మృతి అస్వస్థతకు గురై మృతి చెందిన సంఘటన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. ఉపాధి హామీ పనుల్లో భాగంగా కాలవశ్రీరాంపూర్‌కు చెందిన తిప్పని వెంకటమ్మ (60) ఎస్సారెస్పీ కాలువల్లో పూడికతీత పనులు చేస్తుండగా ఛాతిలో నొప్పి వస్తుందని కుప్పకూలిపోయింది. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జమ్మికుంట ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హన్మకొండకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తమతో పాటే మాట్లాడుతూ పనులు చేసిన వెంకటమ్మ గ్రామానికి విగత జీవిగా రావడంతో ఉపాధి కూలీలు, కుటుంబసభ్యులు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

అధికారుల సందర్శన

ఉపాధిహామీ కూలీ వెంకటమ్మ మృతి చెందినట్లు ఫీల్డ్ అసిసెంట్ ఇచ్చిన సమాచారం మేరకు ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీపీ నూనేటి సంపత్, ఎంపీవో గోవర్ధన్, ఏపీవో మంజుల, ఎంపీటీసీ జనార్దన్ రెడ్డి, మాజీ సర్పంచులు నాగార్జున్‌రావు, రామిడి సుజాత, నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. వెంకటమ్మ కుటుంబానికి సహాయం అందజేసి ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.